క్లుప్తంగా

నీటి నిల్వలు లేకుండా చూసుకోండి



తెనాలిఅర్బన్: ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సాలిపేటలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ డివి కిషోర్ కుమార్ సూచించారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాలిపేటలో మలేరియాశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటు వలన మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బోదకాలు, మెదడువాపు వంటి వ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సహాయ మలేరియా అధికారి వంగాల పున్నారెడ్డి, సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఫైలేరియా సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ గుద్దంటి రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ వైద్యుడు దక్షిణామూర్తికి అభినందన



తెనాలి: గీతా నర్సింగ్‌హోమ్ స్థాపించి తన వైద్యసేవలకు అయిదు దశాబ్దాలైన సందర్భంగా ఆ వైద్యశాల వ్యవస్థాపకుడైన సీనియర్ వైద్యుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, ఆయన కుమారుడు డాక్టర్ వేణుగోపాల్‌ను పట్టణానికి చెందిన పలువురు వైద్యులు శుక్రవారం అభినందనలు తెలియజేశారు. సీటీ స్కాన్ అండ్ డయాగ్నోస్టిక్స్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చంద సాంబశివుడు, డైరెక్టర్లు డాక్టర్ జె.కోటినాగయ్య, డాక్టర్ ఎంవీ సత్యనారాయణ, డాక్టర్ కె.శివరామకృష్ణ, డాక్టర్ కె.శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ వేమూరి శేషగిరిరావు పాల్గొన్నారు. పేదల వైద్యచికిత్సలో డాక్టర్ దక్షిణామూర్తి దాక్షిణ్యాన్ని కొనియాడారు.

లఘుచిత్రం 'నిర్ణయం' క్లైమాక్స్ చిత్రీకరణ



తెనాలి: మధ్యతరగతి మనిషి ఎదుర్కొనే సమస్యలు ఇతివృత్తంగా తీస్తున్న లఘుచిత్రం 'నిర్ణయం' అని దర్శకుడు సాయి లక్కరాజు వెల్లడించారు. స్వరలయ ప్రొడక్షన్స్ బ్యానర్‌తో నిర్మిస్తున్న ఈ లఘుచిత్రాన్ని సాయి లక్కరాజు రచించి, దర్శకత్వ వహిస్తున్నారు. స్థానిక వహాబ్‌రోడ్‌లో శుక్రవారం క్లైమాక్స్ దృశ్యాలను చిత్రీకరించారు. కథ ప్రధానంగా తీస్తున్న తన లఘుచిత్రాలు విస్తృత ఆదరణ పొందాయనీ, ఈ నెలాఖరులో అంతర్జాలంలో స్వరలయ స్టూడియోస్ ద్వారా విడుదలయ్యే 'నిర్ణయం'ను కూడా ఆదరించాలని కోరారు. ఇందులో స్థానిక కళాకారులు, విజయవాడ నటీమణులు నటించినట్టు తెలిపారు. కుటుంబసమేతంగా చూడగల అంశాలతో లఘుచిత్రాలను చిత్రీకరిస్తున్న సాయి లక్కరాజు అభినందనీయులని స్వరలయ సభ్యుడు, జీడీసీసీబీ విశ్రాంత సీఈఓ డి.సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

తెనాలిరూరల్: వ్యభిచార గృహంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. తెనాలి త్రీటౌన్ సీఐ కె. చంద్రశేఖర్, ఎస్‌ఐ ఎం. ఉమామహేశ్వరరావుకు వచ్చిన సమాచారంతో పట్టణ నాజరుపేటలోని ఓ ఇంటిపై శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. తాడేపల్లికి చెందిన వ్యభిచార నిర్వాహకుడు షేక్ గఫూర్‌ను అదుపులోకి తీసుకుని ఇద్దరు మహిళలను కాపాడారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

25న మా-ఏపీ సభ్యులకు ఈ-శ్రమ్ గుర్తింపు కార్డులు

తెనాలి: మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా-ఏపీ) సభ్యులకు కేంద్రప్రభుత్వం ఈ-శ్రమ్ కార్డులను ఉచితంగా అందజేయనున్నట్టు మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా శుక్రవారం తెలియజేశారు. జూన్ 25వ తేదీ ఉదయం 9 గంటల్నుంచి కార్మికశాఖ తెనాలి సహాయ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ వినయకుమార్‌లు వీటిని అందజేస్తారనీ, కేంద్రప్రభుత్వం ఉచితంగా ఇచ్చే ఈ కార్డులకయే ఖర్చును తమ సంస్థ భరిస్తుందని చెప్పారు. ఈ-శ్రమ్ కార్డులు కలిగిన కార్మికులకు బీమాతోపాటు రూ.2 లక్షల ప్రమాదబీమా సౌకర్యం ఉంటుందన్నారు. చట్టపరమైన సంరక్షణ లేని ప్రదేశాల్లో పనిచేసే భవన నిర్మాణ కార్మికులు, తోపుడుబండ్ల వ్యాపారులు కూడా ఈ-శ్రమ్ కార్డుకు అర్హులైనని చెప్పారు. మా-ఏపీ సభ్యులతోపాటు ఇతర కార్మికులు కూడా తమ సంస్థలో ఈ-శ్రమ్ కార్డుకు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 25వ తేదీ ఉదయం 9 గంటలకు హాజరయే సభ్యులు/కార్మికులు ఆధార్, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్, నామినీ బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు ఫొటోలు విధిగా వెంట తెచ్చుకోవాలని సూచించారు. తొలుత పేరు నమోదుకోసం ఆలపాటి నగర్, సుల్తానాబాద్‌లోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని వివరించారు.

గ్రామ సేవాలయాలు

తెనాలిరూరల్: గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం తీసుకురావాలన్న ఆలోచనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ/వార్డు సచివాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. సచివాలయాల్లో 10–12 శాఖల అధికారులను నియమించారు. ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇక ప్రజలకు ఏ అవసరమొచ్చినా వారి గ్రామాల్లోనే సేవలు పొందేలా వాటిని తీర్చిదిద్దారు. దీంతో సచివాలయాలకు దేశంలో మంచి పేరు ప్రతిష్ఠలు వచ్చాయి. సచివాలయాలు ప్రజలకు సేవా నిలయాలుగా మారాయి.



జగ్గడిగుంటపాలెంలో ఇటీవల ప్రారంభించిన గ్రామ సచివాలయం

ప్రజల ముంగిటకే సేవలు..

సచివాలయాల ఏర్పాటుతో ప్రజల ముంగిటకే పాలన అనే నినాదం నిజమైంది. గత పాలకులు ఎప్పుడో ఒక సారి వచ్చి ఇంటి వద్దకే పాలన అందిస్తున్నామని గొప్పలు చెప్పుకునే వారు. కానీ జగనన్న ప్రభుత్వం పక్కాగా ఇంటి వద్దకే పాలన అందిస్తోంది. వలంటీర్‌వ్యవస్థ ద్వారా పింఛన్, రేషన్, ఇతర పథకమైనా నేరుగా ఇంటి వద్దకే పంపిస్తోంది. ప్రజలు ఈ వ్యవస్థకు జేజేలు పలుకుతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో సచివాలయాలను ఏర్పాటు చేయాలంటే వేల కోట్లతో కూడుకున్న ప్రాజెక్ట్, అయినప్పటికీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి రెండు వేల జనాభాకు సచివాలయం నిర్మించారు. అందులో ఉద్యోగులను నియమించి ఫర్నిచర్ ఏర్పాటు చేయడం తలకు మించిన భారం. అయినా లెక్క చేయని సీఎం వాటన్నింటిని చకచకా పూర్తి చేయిస్తూ వినియోగంలోకి తీసుకువస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం సాహసోపేతం అని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేయడంతో పాటు తమకు అందుతున్న సేవల పట్ల కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

సచివాలయాల్లో సేవలు..

సచివాలయాల్లో ప్రభుత్వానికి సంబంధించి వందల రకాల సేవలు అందుతున్నాయి. ముఖ్యంగా నవరత్నాలకు సంబంధించిన పింఛన్ పంపిణీ, చేదోడు, చేయూత, అందరికీ ఇళ్లు, మ్యుటేషన్, ఇల్లు భూముల రీ సర్వే, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పీఎం కిసాన్ తదితర పథకాలను వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్నారు. గతంలో రేషన్ కార్డు, ఇంటి స్థలాలువంటి ఏ పథకం కావాలన్నా మండల కేంద్రానికి కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి ఇబ్బంది లేకుండ మా గ్రామంలోనే అన్ని సేవలు పొందుతున్నామని ప్రజలు సచివాలయాల పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తెనాలిలో సచివాలయాలు ఇలా..

ప్రభుత్వం ఒక్కో సచివాలయ నిర్మాణానికి రూ. 40 లక్షలు కేటాయిస్తోంది. తెనాలి మండలంలోని 18 గ్రామాలకు గాను పెదరావూరు, కొలివరం, అంగలకుదురు, నందివెలుగు గ్రామాల్లో రెండు చొప్పున సచివాలయాలు ఉన్నాయి. మల్లెపాడు–చావావారిపాలెం గ్రామాలకు కలిపి ఒకటి, నేలపాడు–తేలప్రోలు గ్రామాలకు ఒకటి, కోపల్లె–గుడివాడకు కలిపి ఒకటి, బుర్రిపాలెం, జగ్గడిగుంటపాలెం, సంగంజాగర్లమూడి గ్రామాల్లో ఒక్కో సచివాలయం ఉన్నాయి. కొలకలూరులో మూడు సచివాలయాలు ఉండగా, ఖాజీపేట, హాఫ్‌పేట గ్రామాలు కొలకలూరు సచివాలయం-3 కింద ఉన్నాయి.



సచివాలయ వ్యవస్థ ఆదర్శం..

గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం. ప్రజలకు అవసరమైన సేవలన్నీ వీటి ద్వారానే వారి గ్రామాల్లోనే అభిస్తున్నాయి. ఇప్పుడు ఏ ఒక్కరూ మండలం కేంద్రానికి రావాల్సిన అవసరం లేదు. గ్రామంలోని సచివాలయానికి వెళితే క్షణాల్లో వారికి అవసరమైన సేవలు అందుతున్నాయి. దీనిపై ప్రజల్లో సంతృప్తి వ్యక్తమవుతోంది.

– చెన్నుబోయిన శ్రీనివాసరావు, తెనాలి ఎంపీపీ



సచివాలయాలు సేవా కేంద్రాలుగా మారాయి..

గ్రామ సచివాలయాలు ప్రజల సేవా కేంద్రాలుగా మారాయి. అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. ప్రజలకు అవసరమైన సేవలను వలంటీర్లు వారి ఇళ్లకే వెళ్లి అందిస్తున్నారు. అర్జీలు పెట్టుకుంటూ మండల కేంద్రం చుట్టూ తిరగాల్సిన పని లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి.

– కుంభం బాలాజీ, జగ్గడిగుంటపాలెం సర్పంచ్



సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు..

గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. ప్రభుత్వ పథకాల అర్హులను గుర్తించడంలో వలంటీర్లు బాధ్యతగా వ్యవహరిస్తుండగా, గ్రామ సచివాలయాల సిబ్బంది వారికి పథకాలు వర్తించేలా తగిన చర్యలు తీసుకుంటున్నారు. సచివాలయాల ద్వారా అందరికి త్వరితగతిన సేవలు అందుతున్నాయి.

– పినపాటి రవికిరణ్, వలంటీర్, మల్లెపాడు

వైభవంగా నగరేశ్వరస్వామికి అన్నాభిషేకం



ప్రత్యేక పూజల్లో దేవస్థానం కమిటీ నాయకులు



శ్రీనగరేశ్వరస్వామికి అన్నాభిషేకం

తెనాలి: పట్టణ బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో పంచాక్షరి మంత్ర జప దీక్ష పారాయణ మహాయజ్ఞంలో భాగంగా శుక్రవారం శ్రీవింధ్యవాసిని సమేత నగరేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, స్వామివారికి అన్నాభిషేకం, సహస్రలింగార్చనను వైభవంగా నిర్వహించారు. ఆలయ పాలకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమమిది. అపమృత్యుదోషాలు తొలగిపోవాలని, ఆయురారోగ్యాలు కలగాలని స్థానికులు, భక్తులు ఎవరికి వారు పరమేశ్వరుడిని దృష్టిలో ఉంచుకుని ప్రతిరోజూ 108 పర్యాయాలు 'ఓం నమఃశ్శివాయ' అనే పంచాక్షరి మంత్రాన్ని గుప్పెడు బియ్యం చేతపట్టుకుని మంత్రజపం చేశారు. ఆ బియ్యాన్ని తీసుకొచ్చి, ఆలయంలో శ్రీనగరేశ్వరస్వామికి సమర్పించారు. నగరేశ్వరస్వామికి చేసిన అన్నాభిషేకంలో అవిధంగా భక్తులు సమర్పించిన 365 కిలోలకు పైగా బియ్యాన్ని స్వయంపాకంగా వినియోగించారు. లోకకళ్యాణార్థం ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుతూ జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో తెనాలి, పరిసర ప్రాంతాల్నుంచి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు మహా అన్నసంతర్పణ చేశారు. స్వామివారికి అన్నాభిషేకం చేసిన ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు, కార్యదర్శి బుర్లె నరసింహారావు, వైకుంఠపురం ఆలయ ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ వుప్పల వరదరాజులు, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, గొడవర్తి సాయిహరేరామ్, మద్దాళి శేషాచలం, అత్తలూరి నరసింహారావు, అన్నవరపు నరసింహారావు, నూకల వెంకట భాస్కర్ పర్యవేక్షించారు.

శ్రీదత్తసాయి ఆలయం 17వ వార్షిక ఉత్సవాలు

ఈమని(తెనాలి): దుగ్గిరాల మండల గ్రామం ఈమనిలోని శ్రీదత్తసాయి ప్రేమమందిరం 17వ వార్షిక ప్రతిష్ఠ వార్షికోత్సవాలు ఈనెల 19 నుంచి 21వ తేదీవరకు వైభవంగా జరగనున్నాయి. ఇందులో భాగంగా తొలిరోజైన 19వ తేదీన సంప్రదాయ భజనలు నిర్వహిస్తారు. 20వ తేదీన శ్రీసాయి సచ్చరిత్ర పారాయణం ఉంటుంది. చివరిరోజైన 21న శ్రీసాయిబాబాకు విశేష అభిషేకాలు, శ్రీసాయి మంత్ర జప తర్పణ హోమాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటల్నుంచి అన్నప్రసాద వినియోగం ఉంటాయి. అదేరోజు రాత్రి 8.30 గంటలకు సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. శ్రీమహానందీశ్వర నాట్యమండలి, తెనాలి వారిచే 'పాండవోద్యోగం' నుండి పాన్పు సీను, 'శ్రీరామాంజనేయ యుద్ధం' ప్రదర్శిస్తారని వివరించారు. శ్రీదత్తసాయి ప్రేమమందిరం, శ్రీఅన్నపూర్ణ ఉచిత హోమియో వైద్యసేవా కేంద్రం, శ్రీకొఠపాటి అన్నపూర్ణమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో ఈ వేడుకలు జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు.

చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆర్కే చేయూత

మంగళగిరి: నగరంలోని పలువురు చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చేయూతనందించారు. నగరానికి చెందిన తారాజుల రమేష్, అహ్మద్ అలీ, దామర్ల బాబూరావు, చంద్రమ్మలకు వ్యాపారాలకు తోపుడు బండ్లు, ఇస్త్రీ బండ్లు కావాలని కోరగా ఎమ్మెల్యే ఆర్కే స్పందించి వాటిని సొంత నిధులతో తయారు చేయించి అందజేశారు. నగరంలోని ఆటోనగర్‌లోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం వద్ద చిరు వ్యాపారులకు మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, నాయకులు సంకె సునీత, మల్లవరపు సుధారాణి, బొమ్ము శివరామిరెడ్డి, ఆకురాతి రాజేష్, మహ్మద్ ఫిరోజ్‌ల చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు.

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని గ్రామంలో అద్దెబండ్లపై చిరువ్యాపారం చేసుకునే వారికి ఎమ్మెల్యే ఆర్కే సహకారంతో శుక్రవారం తోపుడు బండ్లను అందజేశారు. కార్యక్రమంలో దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి అందజేశారు.

గృహ కార్మికుల సంక్షేమానికి కృషి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కత్తెర హెనీ క్రిస్టినా సురేష్‌కుమార్, మద్దాళి గిరిధర్

గుంటూరు ఎడ్యుకేషన్: గృహ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. మల్లికార్జునపేటలోని సెయింట్ ఆన్స్ మనో వికాస కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గృహ కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హెనీ క్రిస్టినా మాట్లాడుతూ గృహ కార్మికులుగా పని చేస్తున్న మహిళలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాల్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలతో అర్హులైన మహిళలందరికీ లబ్ధి చేకూరుతోందని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ సమాజంలో అన్ని రకాల వృత్తులవారు గౌరవ ప్రదంగా జీవించాలనేది ప్రభుత్వ ముఖ్యోద్దేశమని, దానికి అనుగుణంగా గృహ కార్మికులకు శ్రమకు తగిన వేతనాలు, పెన్షన్ వంటి సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని చెప్పారు. గృహ కార్మికుల న్యాయమైన సమస్యల్ని పరిష్కరించి, హక్కుల సాధనకు సహకారాన్ని అందిస్తామని తెలిపారు. మోంట్‌ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ వర్గీస్ తెరసేత్ మాట్లాడుతూ గృహ కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. గృహ కార్మికుల హక్కుల్ని పరిరక్షించడంతో పాటు హింస, వివక్షతకు వ్యతిరేకంగా వారిని కాపాడేందుకు సమగ్ర రక్షణ చట్టం అవసరమని తెలిపారు. గృహ కార్మికుల్ని ఈఎస్ఐ, పీఎఫ్‌లో చేర్చి, ప్రభుత్వం ఇళ్లను నిర్మించి ఇవ్వాలని కోరారు. సదస్సులో వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ కత్తెర సురేష్‌కుమార్, గుంటూరు ప్రొవిన్షియల్ సుపీరియర్ సిస్టర్ పాల్‌శ్రీసా, మైనార్టీ సంక్షేమశాఖ సలహాదారు డాక్టర్ మద్దు బాలస్వామి, సీఎస్ఎస్‌పి జనరల్ కౌన్సిలర్ సిస్టర్ రీనా జోస్, గృహ కార్మికుల సమాఖ్య కార్యదర్శి సిస్టర్ వ్యాకుల మేరి, సమాఖ్య ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

భూ సర్వే పరిశీలించిన ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్లు



రీసర్వేలో పాల్గొన్న ట్రైనింగ్ అసిస్టెంట్ కలెక్టర్లు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడి గ్రామంలో 2022 ట్రైనింగ్ అసిస్టెంట్ కలెక్టర్లు శుక్రవారం పర్యటించారు. జగనన్న శాశ్వత భూ హక్కు సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ లాండ్ సర్వే జాయింట్ డైరెక్టర్ సీహెచ్ పీఎస్ కుమార్, ఏపీ హెచ్‌ఆర్డీ అడ్మిన్ రవీంద్ర మాట్లాడుతూ 2022 బ్యాచ్‌కు సంబంధించిన ఐఏఎస్ ట్రైనింగ్ అసిస్టెంట్ కలెక్టర్లుకు ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వేపై అవగాహన కార్యక్రమాన్ని ప్రాక్టికల్‌గా ట్రైనింగ్ ఇస్తున్నామని చెప్పారు. నాలుగు గంటల పాటు పర్యటన సాగింది.

బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం నేరం



నెహ్రూనగర్: బాల కార్మికుల్ని పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని 21వ డివిజన్ కార్పొరేటర్ కాంద్రకుంట గురవయ్య తెలిపారు. చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొండ వెంకటప్పయ్య కాలనీలో కేఎస్ఆర్‌టీ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలులో శుక్రవారం బాల కార్మిక వ్యతిరేక మాసం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలందరిని బడికి వెళ్లే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైలజ, ఫౌండేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ జి. వెంకయ్య, స్కూల్ హెచ్ఎం రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.మూడు లక్షల వ్యయంతో కల్వర్టులు నిర్మిస్తాం

చైర్‌పర్సన్ ఖలేదా నసీం



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఖలేదా నసీం

తెనాలిఅర్బన్: చినరావూరు పార్కు పక్కనే ఉన్న రావిచెట్టు నుంచి రైల్వేగేటుకు వెళ్ళే వైజంక్షన్ ప్రాంతంలో రూ.మూడు లక్షలతో కల్వర్టు త్వరలో నిర్మిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీం ప్రకటించారు. దానికి సంబంధించిన టెండర్లు కూడా పూర్తి అయ్యాయని, పనులు ప్రారంభించడమే ఆలస్యమన్నారు. శుక్రవారం 13వ వార్డు కౌన్సిలర్ కుర్రా సుజాతతో కలిసి ఆమె ఆ ప్రాంతంలో పర్యటించారు. చిన్నపాటి వర్షానికి కూడా నీటితో నిండిపోతుందని కౌన్సిలర్ తెలియజేశారు. రోడ్డు ఎత్తు పెంచడంతో పాటు కల్వర్టులు నిర్మించాలని కోరారు. దీనిపై స్పందించిన చైర్‌పర్సన్ వెంటనే పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట ఏఈ చైతన్య, వైఎస్సార్ సీపీ నాయకులు కుర్రా శ్రీను, పిల్లి వీరయ్య, పఠాన్ షరీఫా, చంద్రశేఖర్, అక్కల రమేష్, ఉగం సాంబయ్య, తదితరులు ఉన్నారు.

త్రీ టౌన్ సీఐ బాధ్యతల స్వీకారం



సీఐ రమేష్‌బాబు

తెనాలిరూరల్: తెనాలి త్రీ టౌన్ సీఐగా నియమితులైన ఎస్. రమేష్ బాబు శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రేంజ్ పరిధిలో జరిగిన బదిలీల్లో భాగంగా పల్నాడు జిల్లా వినుకొండ సీఐగా పనిచేస్తున్న రమేష్ బాబు తెనాలి త్రీ టౌన్‌కు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన యు శ్రీనివాసులు బదిలీ అయ్యారు. 1998వ బ్యాచ్‌కు చెందిన సీఐ రమేష్ బాబు స్వస్థలం ప్రకాశం జిల్లా కాగా ఆ జిల్లాలోని పలు స్టేషన్లలో ఆయన పని చేశారు. 1998లో మొదటిగా రిజర్వ్ ఎస్ఐగా సెలక్టయ్యారు. 2011లో కన్వర్షన్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మాచర్ల, దాచేపల్లి, కారంపూడి, యడ్లపాడు స్టేషన్లలో ఎస్ఐగా పని చేశారు. అనంతరం పదోన్నతి పొంది సిఐడి విభాగంలో నాలుగు ఏళ్ల సీఐ హోదాలో పని చేశారు. సిఐడి నుండి వినుకొండకు బదిలీపై వచ్చి అక్కడ రెండేళ్లపాటు సేవలందించారు. తాజా బదిలీల్లో భాగంగా తెనాలి త్రీ టౌన్ సీఐగా నియమితులయ్యారు. తెనాలి త్రీ టౌన్ కు బదిలీపై వచ్చిన రమేష్ బాబుకు ఎస్సైలు విజయ్ కుమార్, ట్రాఫిక్ ఎస్ఐ జోగి శ్రీనివాస్, స్టేషన్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. అందరి సహకారంతో త్రీ టౌన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని నూతన సీఐ తెలియజేశారు.

తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా ప్రసూనారెడ్డి



ప్రసూనారెడ్డి

తెనాలి: తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా ప్రసూనారెడ్డి బాధ్యతల్లోకి వచ్చారు. ఆయన స్వస్థలం రాజమహేంద్రవరం. ప్రస్తుతం తమిళనాడు సర్కిల్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని తపాలశాఖ ప్రజలకు అనేక రకాలైన పథకాలను అందిస్తోందని, వాటిని మారుమూల ప్రజానీకానికి సైతం చేరువ చేయాలన్నదే తన లక్ష్యంగా చెప్పారు. ప్రముఖులకు తక్కువ ఖర్చుతో జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకునేందుకు వీలుగా 'ఈ-పోస్ట్...సర్వీసు అమలులో ఉందన్నారు. ఈనెల 20వ తేదీన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమెకు కేవలం రూ.10లతో ఈ-పోస్ట్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయవచ్చని చెప్పారు. తెనాలి డివిజనులోని ప్రతి పోస్టాఫీసులోనూ ఈ సౌకర్యం ఉందని, అభిమానులు, ఆసక్తి గలవారు వినియోగించుకోవచ్చని ఆయన సూచించారు.

తపాల జీవితబీమా/ గ్రామీణ తపాల జీవితబీమా పాలసీలను కొందరు రెన్యూవల్ చేయడం లేదన్న భావనతో పునరుద్ధరణకు తపాలశాఖ అవకాశం కల్పించిందని చెప్పారు. ఈనెల ఒకటో తేదీనుంచి జూలై 31వ తేదీవరకు ఈ సౌలభ్యం అందుబాటులో ఉంటుందని. పునరుద్ధరణకు చెల్లించాల్సిన డిపాల్ట్ ఫీజులో రూ.లక్ష నుండి రూ.3 లక్షల వరకు 25 శాతం అంటే రూ.3000 వరకు, రూ.3 లక్షలు ఆపైన 30 శాతం రాయితీ అంటే రూ.3500 వరకు తగ్గింపు ఉంటుందని వివరించారు.

మహిళల కోసం సరికొత్త డిపాజిట్ పథకం...

తపాలశాఖ ప్రత్యేకించి మహిళల కోసం 'మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్'ను ఇటీవలే ప్రవేశపెట్టిందని ప్రసూనారెడ్డి తెలిపారు. మహిళా సాధికారత కోసం కేవలం మహిళలకే ఉద్దేశించిన ఈ పథకంలో మహిళలు ఎవరైనా రూ.2 లక్షలు డిపాజిట్ చేస్తే, రూ.7.5 శాతం వడ్డీతో రెండేళ్లకు రూ.36 వేలకు పైగా అదనంగా వస్తుందని, డిపాజిట్‌పై 40 శాతం లోను రూపంలో తీసుకోవచ్చనీ వివరించారు. మొదట రూ.1000తో డిపాజిట్ ఆరంభించి, మూడునెలల్లో రూ.2 లక్షల డిపాజిట్‌ను పూర్తిచేసుకునే వెసులుబాటును కల్పించిందని చెప్పారు. విదేశాలకు వివిధ రకాల పార్శిళ్లను పంపుకునే వారికోసం 'డాక్ నిర్యాత్ కేంద్ర...ను బాపట్ల ప్రధాన పోస్టాఫీసులో ఏర్పాటు చేశామన్నారు. విదేశాలకు పంపాల్సిన వస్తువులను తీసుకెళితే, అక్కడి సహాయకులు ప్యాకింగ్ చేసి బుక్ చేస్తారని వివరించారు. ప్రజలు తపాలశాఖ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

18న బీజేపీ ఆధ్వర్యంలో బహిరంగ సభ



సమావేశంలో వివరాలు తెలియజేస్తున్న, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ

తెనాలిటౌన్: ప్రధానమంత్రిగా నరేంద్రమోడీ తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నెలరోజుల పాటు అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, దీనిలో భాగంగా ఈ నెల 18న తెనాలిలో బీజేపీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ తెలిపారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు తెలియజేశారు. సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. పేద ప్రజల సంక్షేమం కోసం తొమ్మిది సంవత్సరాల్లో బీజేపీ ప్రభుత్వం 140కి పైగా పథకాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. వాటి గురించి ప్రజలకు వివరించేందుకు సభలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు టి.అనంతాచార్యులు, అన్నవరపు వేణు, కొత్తపల్లి యోగనంద కిషోర్, సాయికృష్ణ, ప్రవీణ్, శివభవన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

సిబ్బందికి ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ సూచన



వైద్యులు, పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హాఫీజ్

నగరంపాలెం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ సిబ్బందికి సూచించారు. పోలీస్ సంక్షేమ దివస్ సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని పోలీస్ యూనిట్ ఆసుపత్రిలో అన్ని పోలీస్‌స్టేషన్ల పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు కాటూరి అర్బన్ వైద్య సిబ్బంది ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంమే మహా భాగ్యమని తెలిపారు. అనంతరం వైద్య సిబ్బంది వైద్యసేవలు, నిర్ధారణ పరీక్షలు చేపట్టారు. ఆరోగ్యంగా ఉండేందుకు సూచనలు, సలహాలు అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ కె.కోటేశ్వరరావు, డీఎస్పీ చంద్రశేఖరరావు, ఆర్ఐలు థామస్‌రెడ్డి, రాఘవయ్య, ప్రేమ్‌కుమార్, ఆర్ఎస్ఐలు, కాటూరి అర్బన్ వైద్యులు శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వరరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, ఫర్నీ, సిబ్బంది పాల్గొన్నారు.